

సన్నధాన్యం బోనస్ జమ

ప్రభుత్వ కేంద్రాల్లో సన్నధాన్యం అమ్మిన 9,156మంది జిల్లా రైతుల ఖాతాల్లో రూ.35.73 కోట్ల బోనస్ జమ అయింది. 8లో



దాడి గర్హనీయం..

ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో ర్యాలీ నిర్వహిస్తున్న వారిపై దాడి చేయడం గర్హనీయమని పలువురు బీజేపీ నేతలు పేర్కొన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 25°

జిల్లాలో ఆదివారం ఉదయం, సాయంత్రం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం కొద్దిమేర ఎండ పెరిగే అవకాశముంది.

చలచల్లగా వెళ్లొద్దామా !

మండు వేసవిలో ఏసీ బస్సులకు ఆదరణ

- ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు
- ఇతర డిపోల నుంచి సైతం రాజధాని, లహరి సర్వీసులు
- రెండు నెలల్లో రీజియన్‌కు రూ.7.43 కోట్ల ఆదాయం





ఖమ్మం బస్టాండ్‌లో రాజధాని బస్సు వద్ద ప్రయాణికులు (ఇన్‌సెట్) హైదరాబాద్‌కు ఆదివారం మధ్యాహ్నం వెళ్లే లహరి బస్సులో పూర్తిగా బుక్ అయిన సీట్లు

ఖమ్మంమయూరిసెంటర్: మండు వేసవిలోనూ చల్లని గాలిలో పయనం సాగించేలా ప్రయాణికులు ఏసీ బస్సులను ఎంచుకుంటున్నారు. వారి అవసరం, ఆసక్తికి అనుగుణంగా టీజీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల సంఖ్య పెంచింది. తద్వారా ఏప్రిల్, మే నెలల్లో ఈ బస్సులు నడిపించడం ద్వారా 1,62,557 మంది గమ్యస్థానాలకు చేరడంతో ఖమ్మం రీజియన్‌కు రూ.7,43,53,892 ఆదాయం సమకూరింది. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు గంటకొకటి చొప్పున నాన్ స్టాప్ రాజధాని సర్వీసులు నడిపించడం, ఖమ్మంతో పాటు మిగతా డిపోల నుంచి రాజధాని, లహరి ఏసీ బస్సుల ద్వారా ప్రయాణికులకు సేవలందాయి.

చార్జీ ఎక్కువైనా ఓకే..

ఉమ్మడి జిల్లాలో ఈ వేసవిలో ఎండలు 42 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. ఈ నేపథ్యాన బస్టాండ్లకు వస్తున్న వారు ఏసీ బస్సు కనిపిస్తే చాలు ఎక్కేస్తున్నారు. దూర ప్రయాణాలకైతే తప్పనిసరిగా ఏసీ బస్సుల్లోనే సీట్లు ముందస్తుగా రిజర్వ్ చేసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులతో పోలిస్తే ఏసీ బస్సుల్లో చార్జీలు అధికంగా ఉన్నా ఎండ నేపథ్యాన లెక్క చేయడం లేదు. దీంతో దాదాపు అన్ని రోజుల్లోనూ ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 100శాతం నమోదవుతోంది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు సైతం ఆదివారం, ఇతర ప్రత్యేక రోజుల్లో సర్వీసుల సంఖ్య పెంచుతున్నారు. అయితే, రీజియన్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి డిపోలకు రాజధాని, లహరి ఏసీ బస్సులు ఉండగా ఎక్కువగా హైదరాబాద్ రూట్‌లోనే తిప్పుతున్నారు. ఇవికాక హైదరాబాద్‌లోని డిపోల నుంచి సైతం ఉమ్మడి జిల్లాకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఏసీ బస్సులు నడిపిస్తున్నారు. కాగా, కరీంనగర్, గోదావరిఖని, నిజామాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాలకు సైతం ఒకటి, రెండు ఏసీ బస్సులు ఏర్పాటుచేయాలనే ప్రయాణికుల డిమాండ్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు.

రూ.7.43 కోట్ల ఆదాయం..

ఈ వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏసీ బస్సులను రెగ్యులర్‌తో పోలిస్తే ఎక్కువ సర్వీసులు నడిపించింది. ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం డిపోల నుంచి ఏప్రిల్ నెలతో పాటు ఈనెల 23 వరకు 1,62,557 మంది ప్రయాణించగా రికార్డు స్థాయిలో రూ. 7,43,53,892 ఆదాయం సమకూరింది. ఇందులో 34 రాజధాని బస్సుల్లో 1,49,816 మంది నుంచి రూ.6,52,25,993, నాలుగు లహరి ఏసీ బస్సుల్లో 12,741 మంది ప్రయాణించగా రూ.91,27,899 ఆదాయం నమోదైంది. రెండూ కలిపి ఏప్రిల్ నెలలో 87,322 మంది ప్రయాణించగా రూ.3,96,46,952, ఈనెల 23వ తేదీ వరకు 75,235 మంది ప్రయాణించగా రూ.3,47,06,940 ఆదాయం సమకూరిందని ఆర్టీసీ అధికారులు విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి.

ఏప్రిల్, మే 23వరకు ఏసీ బస్సులతో వచ్చిన ఆదాయం

డిపో	ప్రయాణికులు	ఆదాయం (రూ.ల్లో)
ఖమ్మం	1,00,913	4,61,79,270
భద్రాచలం	37,563	1,71,23,886
సత్తుపల్లి	21,237	98,56,103
కొత్తగూడెం	2,844	11,94,633
మొత్తం	1,62,557	7,43,53,892

మరిన్ని నాన్‌స్టాప్ సర్వీసులు



సుఖవంతంగానే కాక త్వరగా గమ్యస్థానాలకు చేర్చేందుకు రాజధాని ఏసీ బస్సులు తిప్పుతున్నాం. ఈ వేసవిలో ఏసీ బస్సులకు ఆదరణ పెరిగింది. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నడిచే నాన్‌స్టాప్ సర్వీసులను ప్రయాణికులు ఆదరిస్తున్నారు. దీంతో రీజియన్ వ్యాప్తంగా నాన్‌స్టాప్ ఏసీ సర్వీసులు పెంచేలా ఆలోచన చేస్తున్నాం.

– ఎ.సరిరామ్, ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్

ఖమ్మం డిపో నుంచే..

ఖమ్మం రీజియన్‌కు వచ్చిన ఆదాయంలో ఖమ్మం డిపో నుంచే అత్యధికంగా లభించింది. ఈ రెండు నెలల కాలంలో రాజధాని బస్సులు 34, లహరి ఏసీ బస్సులు నాలుగు తిరగగా.. ఖమ్మం డిపో నుంచి 21 రాజధాని, రెండు లహరి బస్సులు తిప్పారు. రాజధాని బస్సుల్లో 96,040 మంది ప్రయాణించగా.. రూ.4,16,52,551, లహరి ఏసీ బస్సుల్లో 4,873 మంది ప్రయాణించగా రూ.45,26,719 ఆదాయం సమకూరింది. రీజియన్ మొత్తం ఆదాయంలో 62 శాతం ఖమ్మం డిపో నుంచే లభించడం విశేషం. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు గంటకొకటి చొప్పున రాజధాని ఏసీ నాన్‌స్టాప్ బస్ నడపడం కలిసొచ్చింది.

ప్రపంచంతో పోటీ పడేలా అభివృద్ధి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పక్కన సింగరేణి సీఎండీ బలరాం, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తదితరులు

- ప్రణాళికాయుతంగా యువతకు ఉపాధి అవకాశాలు
- వైరా జాబ్‌మేళాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా: తెలంగాణ యువత ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అందులో భాగంగానే ప్రణాళికాయుతంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వైరాలోని ప్రభుత్వ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను డిప్యూటీ సీఎం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ రంగాల్లో నియామకాలు చేపడుతూనే, యువత ఉపాధి కోసం ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉద్యోగం చేస్తూనే లక్ష్యసాధనకు ప్రయత్నించాలని సూచించారు.

రూ.100కోట్ల వ్యయంతో సాగునీరు

వైరా రిజర్వాయర్, సాగర్ కాల్వల ద్వారా ఇతర చెరువులకు సమృద్ధిగా గోదావరి నీరు అందించాలనే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతల పథకం కింద ప్రత్యేకంగా రూ.100కోట్ల వ్యయంతో రాజీవ్ కెనాల్ నిర్మించామని భట్టి తెలిపారు. వైరా రిజర్వాయర్ కాల్వల ఆధునికీకరణకు రూ.44 కోట్లు మంజూరు చేశామన్నారు. అలాగే, పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యనందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. అంతేకాక ఐటీఐని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ సహకారంతో జాబ్‌మేళా విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆతర్వాత ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ తదితరులు మాట్లాడారు. కాగా, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన యువతకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియామకపత్రాలు అందజేశారు. జాబ్‌మేళాకు 5వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరుకాగా, 92కంపెనీల్లో 4,448 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, సింగరేణి జీఎం శాలేం రాజు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, నూతి సత్యనారాయణ, శీలం వెంకటనర్సిరెడ్డి, దొబ్బల సౌజన్య, దార్న రాజశేఖర్, బానోత్ విజయబాయి, కోసూరి శ్రీను, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

పోటెత్తిన నిరుద్యోగులు - 8లో...

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే అర్చకులు స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. ఆతర్వాత తెలంగాణ, ఏపీ నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు. ఈకార్యక్రమంలో ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలిసెట్ టాప్-15లో జిల్లా విద్యార్థులు

- 1, 9వ ర్యాంకులతో సత్తా



లాస్యశ్రీ



సాత్విక

ఖమ్మంసహకారనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ ఫలితాలను శనివారం విడుదల చేశారు. టాప్-15 ర్యాంకులతో జాబితా విడుదల చేయగా, ఇందులో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. ఈమేరకు తూమాటి లాస్యశ్రీ ఎంపీసీ, బైపీసీలో 120కి 120మార్కులతో రెండు విభాగాల్లోనూ రాష్ట్ర ప్రథమస్థానం సాధించడం విశేషం. అలాగే, కాజా హరిదీప్ రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించాడు. కాగా, ఖమ్మం న్యూ విజన్ పాఠశాల విద్యార్థులు తూమాటి లాస్యశ్రీ రాష్ట్రస్థాయిలో ప్రథమర్యాంకు, కోట సాత్విక రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంకు సాధించారని ప్రిన్సిపాల్ జే.వీ.మైఖేల్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లోనూ రాష్ట్ర స్థాయి టాప్ మార్కులు సాధించిన తమ విద్యార్థులు పాలిసెట్‌లోనూ సత్తా చాటారని పాఠశాల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ వెల్లడించారు. ఈమేరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తిరుమలాయపాలెం : బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం/కూసుమంచి: సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేపడుతూ తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తిరుమలాయపాలెం మండలంలోని రాకాసి తండా – మన్నెగూడెం, పాతర్లపాడు క్రాస్ – రావి చెట్టు తండా, మహ్మదాపురంలో బోడతండా – సుబ్లేడు, మేడిదపల్లి రోడ్డు – భవాని గుడి వరకు రహదారులతో పాటు తెట్టెలపాడులో అంతర్గత సీసీ రహదారుల నిర్మా ణం, కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో రహదారి నిర్మాణానికి మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలుచేయగా, మిగతావి కూడా త్వరలోనే అమలుచేస్తామని తెలిపారు. కాగా, ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత మంజూరు పత్రాలు ఇస్తుండగా, ఎక్కడా పొరపాటు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం అమలుచేయనున్నట్లు మంత్రి తెలిపారు. కాగా, మంత్రి తన పర్యటనలో భాగంగా పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ, పీఆర్ ఎస్ఈలు యాకూబ్, వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఆర్డీఓ నర్సింహారావు, ఏడీఏ సరిత, తహసీల్దార్లు లూథర్ విల్సన్, కరుణశ్రీ, ఎంపీడీఓలు సిలార్ సాహెబ్, వేణుగోపాల్‌రెడ్డితో పాటు చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, మంగీలాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతం ఎన్నటికీ చావదు..

- వామపక్ష లౌకిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం
- గిరిప్రసాద్ వర్ధంతి సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



గిరిప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణ, కూనంనేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సిద్ధాంతాన్ని ఆచరిస్తున్న కొందరికి హత్య చేయడం సాధ్యమేమో కానీ ఆ సిద్ధాంతాన్ని చంపేయడం అంత తేలిక కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వెల్లడించారు. ఖమ్మం రిక్కా బజార్ హైస్కూల్ మైదానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి సభలో పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ.. మావోయిస్టుల సిద్ధాంతాన్ని తాము వ్యతిరేకించినా.. ఆ సిద్ధాంతాన్ని నమ్ముకొని వేలాది మంది ఉన్నారని, వారిని చంపినా మళ్లీ పుట్టుకొస్తారని తెలిపారు. ఇదే సమయాన మావోయిస్టులు సైతం తమ పంథాను మార్చుకోవాలని నారాయణ సూచించారు. రాజ్యాంగానికి మావోయిస్టుల నుంచి కానీ మరే ఇతరుల నుంచి కానీ ప్రమాదం లేదని, ఆ ప్రమాదం బీజేపీ వైపు నుంచే పొంచి ఉందని అభిప్రాయపడ్డారు.

క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు గిరిప్రసాద్

నాడు సాయుధ పోరాటంలో వేల మందిలాగే గిరిప్రసాద్‌ను సైతం హతమార్చాలని ప్రయత్నిస్తే తుపాకీ గుండుకు ఎదురొడ్డి నిలిచారని నారాయణ తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా ఆయన నిలిచారని, తుది శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని చెప్పారు. నియంత పాలనకు ప్రయత్నాలు జరుగుతున్న ఈ తరుణంలో ప్రజా చైతన్యానికి వామపక్ష ఉద్యమం బలపడాలని పిలుపునిచ్చారు. కాగా, హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని అన్నందుకు కొందరు అవాకులు, చెవాకులు పేలారని.. ఇప్పుడు మిస్ ఇంగ్లాండ్ ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పోటీల్లో పాల్గొనే వారిని వేశ్యల్లా చూస్తున్నారని చెప్పిందన్నారు.

చర్చలపై స్పందించరా?

మావోయిస్టులు శాంతిచర్యలకు ప్రతిపాదిస్తున్నా కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. తెలంగాణ చైతన్యానికి ప్రతీక అని.. ఈ గడ్డపై మతోన్మాదం, కుల మత రాజకీయాలకు స్థానం లేదని స్పష్టం తొలుత ఖమ్మం పాత బస్టాండ్ వద్ద గిరిప్రసాద్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, గిరిప్రసాద్ తనయుడు నల్లమల చక్రవర్తి, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మిరియాల రంగయ్య, యర్రా బాబు, శింగు నర్సింహారావు, బీ.జీ.క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, జానీమియా, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీపీఓ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఖమ్మంసహకారనగర్: పూర్వ వీఆర్ఓ, వీఆర్ఏలను గ్రామ పాలనా అధికారు(జీపీఓ)లుగా నియమించేందుకు ఆదివారం నిర్వహించే పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆదివారం ఉదయం 10-30నుంచి మధ్యాహ్నం 1-30 వరకు పరీక్ష జరగనుండగా, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సహా అన్ని వసతులు సమకూర్చాలని తెలిపారు. పరీక్ష ముగిశాక జవాబు పత్రాలను జేఎన్‌టీయూహెచ్‌కు పంపించాలని సూచించారు. జిల్లా నుంచి వీసీకి హాజరైన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 253 మంది పరీక్షకు హాజరుకానుండగా, ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో కేంద్రం ఏర్పాటుచేశామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారిని నోడల్ అధికారిగా నియమించి ఏర్పాట్లు పూర్తిచేశామని వెల్లడించారు. ఈ వీసీలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద ఆంక్షలు

ఖమ్మంక్రైం: జీపీఓల నియామకానికి ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయగా, ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఈ నేపథ్యాన కేంద్రానికి 200మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపుగా ఉండొద్దని, సభలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులకు అనుమతి ఉండదని వెల్లడించారు. అంతేకాక సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసివేయించడంతో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు సీపీ ఓ ప్రకటనలో తెలిపారు.

పోటెత్తిన నిరుద్యోగులు

వైరాలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగులు పోటెత్తారు. వారం రోజులుగా విస్తృత ప్రచారం చేయడమే కాక మండలాల వారీగా నిరుద్యోగులు వచ్చేలా అధికారులు రవాణా ఏర్పాట్లు చేశారు. ఈ మేళాలో 92 కంపెనీల బాధ్యులు పాల్గొని ఇంటర్వ్యూలు చేయగా 5వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం విద్యార్హతల ఆధారంగా 4,448 మందికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు నియామక పత్రాలు అందజేశారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్





జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న అభ్యర్థులు



పిల్లలతో జాబ్‌మేళాకు వస్తున్న అభ్యర్థులు



ఖాళీల వివరాలు పరిశీలిస్తున్న యువకులు





దరఖాస్తు పూర్తి చేస్తున్న అభ్యర్థులు

బీఆర్క్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్, డైరెక్టర్

ఖమ్మంసహకారనగర్: జేఈఈ మెయిన్స్ పేపర్ -2(బీ-ఆర్క్, బీ ప్లానింగ్) ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పి.సాయికుమార్ ఆలిండియా 55, ఎ.గోవర్ధన్ 129 ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే, వి.ప్రణతి 210వ ర్యాంక్, ఎం.ప్రహ్లాద్ 275, బి.వంశీ 292, వి.కుశాల్ 339, డి.అరుణ్ 368, హనుమంత్ సాయి 493, పి.సాయిప్రకాష్ 570 ర్యాంకులు సాధించగా.. 594, 620, 710,712, 728, 751, 778, 892, 918, 953, 982 ర్యాంకులు తమ విద్యార్థులకు వచ్చాయని వెల్లడించారు.

మెరిసిన హార్వెస్ట్ విద్యార్థులు



విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్స్ బీ-ఆర్క్, ప్లానింగ్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఆల్‌ఇండియా టాప్ ర్యాంకులు సాధించారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం వెల్లడించింది. ఎన్‌సీహెచ్.జస్వంత్‌సాయి 38వ ర్యాంకు, ఎం.నాగయశ్వంత్ 117, వై.సాయినేహా 128, బి.ప్రణీత 141, వేముల సాయిదీపక్ 206, పి.క్రిష్‌సాత్విక్ 225, వి.శరణ్ గోపాల్‌స్వామి 253, ఎన్.రాఘవేంద్ర నవనీత్ 302, కందుల రోహిత 346, కమతం విన్య 363 ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారితో పాటు అధ్యాపకులు అభినందించారు.

పాలిసెట్‌లో త్రివేణి విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డైరెక్టర్, తదితరులు

పాలీసెట్ ఫలితాల్లో ఖమ్మం త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థి సరయు 120మార్కులకు గాను 109 మార్కులతో రాష్ట్రస్థాయి 187వ ర్యాంక్ సాధించగా, ప్రణవి 106 మార్కులతో 339వ ర్యాంక్, వెంకట వర్షిత్ 107 మార్కులతో 481, చరిత 103 మార్కులతో 529వ ర్యాంకు సాధించగా, శాహిస్త 1,340, మాన్విత 1,357, హమ్సికా 1,823వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్థులను డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, కృష్ణవేణి – త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, కాట్రగడ్డ మురళీకృష్ణతో పాటు స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు అభినందించారు.

అహర్నిశలు కష్టంతోనే ఈ స్థాయికి...

ఆర్టీఐ కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం కమిషనర్ శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థి దశ నుండి ప్రగతిశీల ఉద్యమాలు, జీవితంలో ఆటుపోట్లు, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుగా పడిన కష్టమే తనను ఈ స్థాయికి చేర్చిందని సమాచార హక్కు చట్టం కమిషనర్ పీ.వీ.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియమితులైన ఆయనను శనివారం ఖమ్మంలో వివిధ సంఘాల ఆధ్వర్యాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ స్నేహితులు తనను సన్మానిస్తుండడాన్ని గర్వంగా భావిస్తున్నానని, ఇదే సమయంలో నూకల నరేష్‌రెడ్డి, తన తల్లితో పాటు బుడాన్ బేగ్ ఉంటే మరింత సంతోషించేవారని తెలిపారు. అనంతరం ఆయన సతీమణి సృజన మాట్లాడగా 'ఆ చల్లని సముద్ర గర్భం' పాట పాడి ఉద్యమ రూపాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జీ.వీ. బిచ్చాల తిరుమలరావు, ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షత వహించగా టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా కార్యదర్శి చిర్రా రవి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వరరావు, ఏనుగు వెంకటేశ్వరావుతో పాటు వెన్నబోయిన సాంబశివరావు, ఉషాకిరణ్, కే.వై.రామచంద్రరావు, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, జైపాల్, కూరపాటి రంగరాజు, కె.దిలీప్, యర్రమల్ల శ్రీను, నందగిరి శ్రీను, సాగర్, డాక్టర్ నారాయణరావు, విప్లవ్‌కుమార్, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, నల్లమల వెంకటేశ్వరావు, గుద్దేటి రమేష్ బాబు, కొరకొప్పుల రాంబాబు, యలమందల జగదీష్, మందుల ఉపేందర్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ



చెక్కులు అందుకున్న వారితో ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి తన సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అందజేశారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో రూ. 2.50 లక్షల విలువైన చెక్కలను శనివారం ఆయన అందించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ తోట వీరభద్రం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిబోయిన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మంస్పోర్ట్స్: సబ్ జూనియర్ విభాగం నుంచి రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు ఇద్దరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో స్థానం సాధించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేస్తున్న శశివర్ధిక 22 కేజీల (సాన్–ద) బాక్సింగ్ బాలికల విభాగంలో, వింగ్‌చున్ బాలుర విభాగంలో చక్రధర్ ఆర్యన్ ఎంపికయ్యారని ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.పరిపూర్ణచారి తెలిపారు. తమిళనాడులోని నమ్మక్కల్ జిల్లాలో సోమవారం నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననుండగా, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఓయూ నుంచి డాక్టరేట్



అశోక్‌కుమార్

సత్తుపల్లి: సత్తుపల్లిలోని గీతమ్స్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన కునుసోతు అశోక్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.రమాదేవి పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. వేరుశనగలో వచ్చే కాండం కుళ్లు తెగులును తక్కువ ఖర్చుతో, సైడ్ ఎఫెక్టులు లేకుండా నిరోధించేలా చేసిన పరిశోధనలపై అశోక్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను గీతమ్స్ కళాశాల డైరెక్టర్ దొడ్డా శ్రీనివాసరెడ్డి, శాంతినికేతన్ కళాశాల ప్రిన్సిపాల్ మమంద్రారెడ్డి, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

రెవెన్యూ విభాగానికి విజిలెన్స్ నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం ద్వారా కొన్నేళ్లుగా జరిగిన కార్యకలాపాలకు సంబంధించి రికార్డులు సమర్పించాలని విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీచేశారు. ఇంటి నంబర్ల కేటాయింపు, మ్యుటేషన్, 58, 59 జీఓ పట్టాల ఇళ్లకు అసెస్‌మెంట్ నంబర్లు కేటాయింపు.. తదితర అంశాల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలతో ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. నోటీసులు అందడంతో కేఎంసీ అధికారుల్లో ఆందోళన నెలకొన్నట్లు సమాచారం. కాగా, గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఇతర మున్సిపాలిటీలకు బదిలీపై వెళ్లగా వారికి సైతం నోటీసులు వెళ్తాయని చర్చ జరుగుతోంది.

సన్న ధాన్యం బోనస్ జమ

జిల్లాలో 9,156 మంది రైతులకు రూ.35.73 కోట్లు



నేలకొండపల్లిలో ధాన్యం కాంటా వేస్తున్న సిబ్బంది (ఫైల్)

నేలకొండపల్లి: యాసంగి సీజన్‌లో సన్నధాన్యం సాగు చేసి ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన రైతులకు ప్రభుత్వం బోనస్ విడుదల చేసింది. ఈమేరకు జిల్లాలోని 9,156 మంది రైతులు 7,14,798.40 క్వింటాళ్ల ధాన్యం విక్రయించగా, వీరి ఖాతాల్లో క్వింటాకు రూ.500 చొప్పున రూ.35,73,99,200 కోట్ల బోనస్ శనివారం జమ చేశారు. ఈసందర్భంగా మండలాల వారీగా రైతులు, విక్రయించిన ధాన్యం, అందించిన బోనస్ వివరాలను వెల్లడించారు. జిల్లాలో అత్యధికంగా నేలకొండపల్లి మండలంలో 2,356 మంది రైతుల నుంచి 1,73,527.60 క్వింటాళ్లు, బోనకల్ మండలంలో తక్కువగా 16 మంది రైతుల నుంచి 635.60 క్వింటాళ్ల సన్నధాన్యం కొనుగోలు చేశారు.

మండలం	రైతులు	ధాన్యం (క్వింటాళ్లలో)	బోనస్ (రూ.ల్లో)
నేలకొండపల్లి	2356	1,73,527.60	8,67,63,800
తల్లాడ	1123	1,46,824.80	7,34,12,400
కల్లూరు	844	92,084.40	4,60,42,200
కూసుమంచి	1219	82,994.80	4,14,97,400
ముదిగొండ	972	54,438.40	2,72,19,200
సత్తుపల్లి	737	47,684.00	2,38,42,000
వేంసూరు	690	38,300.80	1,91,50,400
పెనుబల్లి	313	23,214.80	1,16,07,400
వైరా	85	13,900.00	69,50,000
ఖమ్మం రూరల్	190	8,384.40	41,92,200
తిరుమలాయపాలెం	128	8,228.40	41,14,200
కొణిజర్ల	175	7,900.00	39,50,000
చింతకాని	102	4,604.80	23,02,400
మధిర	35	3,282.00	16,41,000
కామేపల్లి	50	2,669.20	13,34,600
రఘునాథపాలెం	50	2,512.40	12,56,200
ఏన్కూరు	45	1,822.80	9,11,400
సింగరేణి	17	923.20	4,61,600
ఎర్రుపాలెం	09	866.00	4,33,000
బోనకల్	16	635.60	3,17,800

జాతీయవాదులపై దాడి గర్హనీయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ఆర్మీ జవాన్లకు మద్దతుగా ఖమ్మంలో నిర్వహించిన తిరంగా యాత్రలో పాల్గొన్న జాతీయవాదులపై దాడి చేయడం గర్హనీయమని మాజీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల చేపట్టిన యాత్రలో చోటుచేసుకున్న ఘటనతో గాయపడిన బీజేపీ లీగల్ అడ్వైజర్ వెంకట్ గుప్తాను వారు శనివారం పరామర్శించారు. అనంతరం దళితమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, లీగల్‌సెల్ అడ్వైజర్ రమేష్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రుల అండతోనే ఖమ్మంలో జాతీయవాదులపై దాడి జరిగినట్లు తాము భావిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పుట్టిందే ముస్లింల కోసమేనంటూ జిల్లాకు చెందిన మంత్రి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జరిగిన దాడిని ముగ్గురు మంత్రులు ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. కాగా, ఈనెల 25న మహిళామణుల ఆధ్వర్యాన జరిగే సిందూర్ యాత్రకు పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరావు, రామారావు, విజయరాజు, వీరెల్లి రాజేష్ గుప్త, అల్లిక అంజయ్య పాల్గొన్నారు.

90.706 కిలోల గంజాయి దహనం



గంజాయిని దహనం చేయిస్తున్న అధికారులు

ఖమ్మంక్రైం: వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని శనివారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్లలో 90.706 కిలోల ఎండు గంజాయి పట్టుబడగా తల్లాడ మండలం గోపాల్‌పేటలోని బయో వేస్టేజ్ బర్నింగ్ ప్లాంట్‌లో దహనం చేయించామని అదనపు డీసీపీ నరేష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ సీఐ స్వామి, తల్లాడ ఎస్సై కొండలరావు పాల్గొన్నారు.

విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ముదిగొండ: ప్రభుత్వం అందించే శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు మరింత మెరుగైన బోధన చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. ముదిగొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మెరుగైన బోధనతో పాఠశాలల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కాగా, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు కృషి చేస్తామని చెప్పారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బంకా గురువయ్య, ఎస్.సాంబశివరావుతో పాటు కట్టా శేఖర్, టి.రత్నకుమార్ పాల్గొన్నారు.

నవజాత శిశువుల మరణాల నివారణే లక్ష్యం



నియోనాటల్ వాహనం వద్ద వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు

నేలకొండపల్లి: నవజాత శిశువుల మరణాల నివారణే లక్ష్యంగా నియోనాటల్ సేవలు అందిస్తున్నట్లు ఈఎంఆర్‌ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ వద్ద శనివారం నియోనేటల్ సేవలపై ఉద్యోగులకు ఆయన అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 49 అంబులెన్స్‌లుఉండగా, ఒక్కో వాహనం ద్వారా కనీసం నెలకు 120 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు తొలిసారిగా నియోనాటల్ వాహనం మంజూరైందని, ఇందులో అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు దుర్గాప్రసాద్, భాస్కర్, సీతారాం, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి భయంతో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని వాసంశెట్టి ప్రవల్లిక(19) ఆత్మహత్య చేసుకుంది. ఆమె తనకు పెళ్లి చేస్తారని, తద్వారా చదువు ఆగిపోతుందని ఆవేదన చెందినట్లు సమాచారం. ఈ నేపథ్యాన శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనపై ప్రవల్లిక తండ్రి రంగారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

697 కిలోల గంజాయి స్వాధీనం

విలువ రూ.3.48 కోట్లు.. హరియాణా వాసుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

టేకులపల్లి: టేకులపల్లి మీదుగా భారీ మొత్తంలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు, సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు శనివారం సాయంత్రం టేకులపల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ తాటిపాముల సురేష్ వివరాలను వెల్లడించారు. హరియాణా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సదీప్‌కుమార్, లక్విందర్, అమర్‌నాథ్ కుమార్, పవన్‌కుమార్, కృషన్, కుమార్ జల్సాలకు అలవాటుపడి కొన్నేళ్లుగా గంజాయిరవాణాచేస్తున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా బచ్చలూరులో హరికరన్ వద్ద గంజాయి కొనుగోలు చేసి పార్సిల్ సర్వీస్ ద్వారా కురుక్షేత్ర జిల్లాకు తరలించి ప్రిన్స్ కుమార్‌కు విక్రయించేవారు. ఈ క్రమంలో శనివారం బచ్చలూరు నుంచి గంజాయి తీసుకుని కురుక్షేత్రకు రవాణా చేసేందుకు ఐచర్ వ్యాన్‌లో తరలిస్తున్నారు. ముందు ఎస్కార్ట్‌గా కారులో నిందితులు వెళ్తుండగా పక్కా సమాచారంతో టేకులపల్లి, సీసీఎస్ పోలీసులు మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో కారు, వెనకాలే వచ్చిన వ్యాన్‌ను తనిఖీ చేయగా రూ.3.48కోట్ల విలువైన 697.160 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని, గంజాయి అమ్మిన హరికరన్, తెప్పించిన ప్రిన్స్‌కుమార్‌పైనా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈక్రమంలో గంజాయి రవాణాను అడ్డుకున్న సీఐలు టి.సురేష్, రమాకాంత్, ఎస్‌ఐలు రాజేందర్, ప్రవీణ్, రామారావుతో పాటు సిబ్బంది భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

149మంది కానిస్టేబుళ్ల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలో 149 మంది పోలీస్ కానిస్టేబుళ్లను బదిలీచేస్తూ కమిషనర్ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం విడుదలయ్యాయి. కాగా, ఈ నిర్ణయంతో జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో ఐదేళ్లుగా పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగింది.